క్లుప్తంగా

దాశరథి'కి ఘన నివాళి

హన్మకొండ చౌరస్తా: సాహితీవేత్త, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దాశరథి రంగాచార్యుల వర్ధంతిని 5వ డివిజన్‌లోని హనుమాన్‌నగర్ కాలనీ ఫేజ్–1లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీఆర్‌ఎస్ నాయకుడు చల్లా వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటంలో దాశరథి క్రియాశీల పాత్ర పోషించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కుమార్‌రెడ్డి, రాజయ్య, శ్రావణ్, రాజ్‌కుమార్, రవి, కిరణ్, చిరంజీవి, సురేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సేఫ్టీ దుస్తులు పంపిణీ చేయాలి

కాజీపేట రూరల్: రైల్వేశాఖలో అతి ముఖ్యమైన రైల్వే ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ట్రాక్ మెయింటనెయిర్స్‌కు వర్షాకాలంలో సేఫ్టీ దుస్తులు పంపిణీ చేయాలని పలువురు కోరారు. ఈమేరకు సికింద్రాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం) భరేష్‌కుమార్ జైన్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాజీపేటకు చెందిన సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ పి.రవీందర్ మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని విధులకు ఆటంకాలు తలెత్తకుండా రక్షణగా రైల్వే రెయిన్ కోట్, షూ, వింటర్ జాకెట్లు, ఇతర సేఫ్టీ వస్తువులు అందించాలని కోరారు.

23నుంచి కిట్స్‌లో జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

హసన్‌పర్తి: కిట్స్ కళాశాల ఇండోర్ స్టేడియంలో ఈనెల 23వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పింగిళి రమేష్‌రెడ్డి తెలిపారు. బాలురు, బాలికలు, మహిళలు, పురుషుల విభాగాల్లో పోటీలు ఉంటాయని చెప్పారు. ఈనెల 18వ తేదీలోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పద్మశాలి 19వ డివిజన్ అధ్యక్షుడిగా రంజిత్

కాశిబుగ్గ: అఖిల భారత పద్మశాలి సంఘం వరంగల్ 19వ డివిజన్ అధ్యక్షుడిగా క్యాతం రంజిత్‌ను నియమించారు. ఈమేరకు ఆయనకు నియామక పత్రాన్ని వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ వడ్నాల నరేందర్ శనివారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాంబుల కుమార్, వేముల నాగరాజు, జి.కృష్ణ, వి.రాం ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావు మృతికి పలువురి సంతాపం



నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు, తదితరులు

హన్మకొండ కల్చరల్: ప్రముఖ పారిశ్రామికవేత్త, రామోజీ ఫిలిం సిటీ అధినేత చెరుకూరి రామోజీరావు మృతికి తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షరయోధుడు మరణించడం బాధాకరమని వాపోయారు.

ప్రెస్ క్లబ్‌లో..

నయీంనగర్: ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు చిత్రపటానికి గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నివాళి అర్పించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, ఈనాడు – ఈటీవీ జర్నలిస్టులు, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బొల్ల అమర్, జర్నలిస్ట్ సంఘాల నాయకులు, పాత్రికేయులు, ప్రెస్ క్లబ్ బాధ్యులు పాల్గొన్నారు.

కాశిబుగ్గలో..

కాశిబుగ్గ: ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావుకు మృతికి కాశిబుగ్గ జంక్షన్‌లో కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, కాంగ్రెస్ 19, 20, 21వ డివిజన్ల అధ్యక్షులు దాసరి రాజేష్, కుసుమ సతీష్, కొమ్ముల సందీప్‌కుమార్, నీలం శ్రీనివాస్, ఎండీ.మక్బుల్, కట్కూరి అవినాష్, పోలెపాక సుధాకర్, ప్రదీప్, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం హల్‌చల్ చేస్తున్న మహిళ

కాశిబుగ్గ: కాశిబుగ్గ జంక్షన్ సమీపంలోని ఓ ఏటీఎం వద్ద నివాసముంటున్న ఓ మహిళ నిత్యం హల్‌చల్ చేస్తూ దాడులకు పాల్పడుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చుట్టుపక్క వాళ్లతో ఆమె తగాదాలు పెట్టుకున్న సమయంలో ఎన్నిసార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం 100 నంబర్‌కు ఎన్నిసార్లు డయల్ చేసినా పోలీసులు స్పందించడం లేదని తెలిపారు. ఆ మహిళ వల్ల నిత్యం ఇబ్బందులు పడుతున్నామని సుమారు 10 షాపుల యజమానులు చెబుతున్నారు. ఈవిషయంపై పోలీసులు దృష్టి సారించాలని కాశిబుగ్గ వాసులు కోరుతున్నారు.

నెరవేరనున్న చిరకాల వాంఛ

- కాజీపేట చౌరస్తా అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం
- వృత్తాకారంలో పనులు చేపట్టాలని ప్రజల డిమాండ్



కాజీపేట చౌరస్తాలో వాహనాల రద్దీ



ఇటీవల ప్రారంభమైన పనులు



కాజీపేట చౌరస్తాలో ఏర్పాటు చేయనున్న నమూనాకు రూపకల్పన చేసిన అధికారులు

కాజీపేట: కాజీపేట పట్టణ ప్రజలు పుష్కర కాలంగా ఎదురుచూస్తున్న చౌరస్తా అభివృద్ధి పనులు త్వరలో నెరవేరబోతున్నాయి. కలెక్టర్ సిక్తా పట్నాయక్ కలిసి చౌరస్తాలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పర్యటించి అభివృద్ధి పనులు చేపట్టడానికి గల అవకాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా చౌరస్తా అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై మున్సిపల్, కుడా ఇంజనీరింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యే సూచన మేరకు ఇంజనీరింగ్ అధికారులు చౌరస్తాలో ఉన్న స్థలం, చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు కావాల్సిన స్థలం ఎంత అనే అంశాలపై కొలతలను తీసుకుంటున్నారు. చౌరస్తాలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు తయారు చేసేపనిలో ఇంజనీరింగ్ అధికారులు నిమగ్నమయ్యారు. వరంగల్ నగరానికి ముఖద్వారంగా ఉన్న కాజీపేట చౌరస్తా.. అభివృద్ధి చెందక బోసిపోయి కనిపిస్తోంది. ఎటుచూసినా ఎండిన మొక్కలు, శిథిలావస్థకు భవనాలు వెక్కిస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాకు తలమానికంగా ఉన్న అతి పెద్ద కాజీపేట రైల్వే జంక్షన్ ఈ చౌరస్తాకు కూతవేటు దూరంలోనే ఉన్నా అభివృద్ధి శూన్యమనే చెప్పాలి. నగర పర్యటనకు వచ్చే పర్యాటకులకు ఈ చౌరస్తా వెక్కిరిస్తున్నట్లుగా కనిపిస్తోంది.

ప్రజల ఆకాంక్ష మేరకు..

కాజీపేట చౌరస్తాను అభివృద్ధి చేయాలనే ప్రజల చిరకాల వాంఛను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే నాయిని విజ్ఞప్తి చేశారు. ఆయన అభిలాష మేరకు ప్రత్యేక నిధులను మంజూరు చేయడానికి ప్రభుత్వం సంసిద్ధతను వ్యక్తం చేయడంతో అధికారులు పనుల్లో వేగం పెంచారు. ఇంజనీరింగ్ అధికారులు రంగంలోకి దిగి చౌరస్తాలో ఖాళీ స్థలాల కొలతను సేకరించడంతో పాటు ఏ విధంగా పనులు చేపట్టాలనే అంశాలపై నివేదికలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని పనులను లాంఛనంగా పూర్తి చేశారు. అయితే, ఇదంతా బాగానే ఉన్నప్పటికీ పట్టణ ప్రజల అభిప్రాయం మరోలా ఉంది.

వృత్తాకారంలో అభివృద్ధి చేయడమే ఉత్తమం

కాజీపేట చౌరస్తా అభివృద్ధికి తీవ్ర ఆటంకంగా ఉన్న భవనాలను తొలగించి జీరో సర్కిల్ రూపంలో అభివృద్ధి చేయడం ఉత్తమంగా ఉంటుందని పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. చౌరస్తాను జీరో పద్ధతిలో అభివృద్ధి చేయాలని 2001లో అప్పటి కార్పొరేషన్ విస్తృత స్థాయి సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. దాన్ని ప్రస్తుత అధికార పార్టీ నాయకులు పరిగణలోకి తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. కాజీపేట బాలికల ఉన్నత పాఠశాల నుంచి ఫాతిమానగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు రహదారికి ఇరువైపులా రోడ్డును విస్తరించడం వల్ల అభివృద్ధి పనులు చేయడానికి వీలవుతుంది. అనుకున్న విధంగా చక్కగా అందమైన డిజైన్లతో సుందరీకరణ చేయవచ్చని పలువురు చెబుతున్నారు. అలా పనులు చేయడం వల్ల భవిష్యత్‌లో రవాణా అవసరాలకు ఇబ్బందులు తలెత్తవు.

రోడ్డు విస్తరణ అనంతరం పనులు చేపట్టాలి



రహదారి ఇరుకుగా మారడంతో చౌరస్తా మీదుగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. రహదారి విస్తరణకు ఉన్న అడ్డంకులను తొలగించాలి. వృత్తం ఆకారంలో పనులు చేపట్టాలి.

– మర్యాల కృష్ణ, కాజీపేట

ప్రభుత్వ బడి ముద్దు.. ప్రైవేట్ బడి వద్దు



మడికొండలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు



కాజీపేట: సోమిడిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

మడికొండ: ప్రభుత్వ బడి ముద్దు.. ప్రైవేట్ బడి వద్దు అంటూ మండల ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో శనివారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీని హెచ్‌ఎం మల్లారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. బడీడు పిల్లలను సర్కారు బడిలో చేర్పించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ బడిలో పిల్లలపై ఎలాంటి ఒత్తిడి లేని, స్వేచ్ఛాపూరిత వాతావరణంలో ఆటపాటలతో విద్యబోధన ఉంటుందని తెలిపారు. విశాలమైన తరగతి గదులు, క్రీడా స్థలం, ఉచిత యూనిఫాం, ఉచిత పుస్తకాలు అందించడమే కాకుండా వారానికి మూడు రోజులు కోడిగుడ్లుతో సన్న బియ్యంతో మధ్యాహ్నం భోజనం అందించనున్నట్లు వివరించారు. ఉన్నత విద్యనభ్యసించిన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ మడ్డి అరుణ, పాఠశాల ఉపాధ్యాయులు కోమల్‌రెడ్డి, అరుణ, కమల, సరిత, అంగన్‌వాడీ టీచర్లు వెంకటలక్ష్మి, రజిత, జ్యోత్స్న, మల్లీశ్వరి, రాజమణి, లలిత, మంజుల, కవిత, తదితరులు పాల్గొన్నారు.

'బడిబాట'లో ఉపాధ్యాయులు

కాజీపేట: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా.. ఉపాధ్యాయులు సోమిడిలోని ఇంటింటికి వెళ్లి బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ప్రచారం నిర్వహించారు. శనివారం ఉదయం అల్పాహారం, రాగిజావ, మధ్యాహ్న భోజనం, ఉచిత యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధన.. ఇలా తమ పాఠశాలలో చేర్పిస్తే ఏం మేలు జరుగుతుందో విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వ బడుల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ బడుల్లోని సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సోమిడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బల్ల సతీశ్‌కుమార్, ఉపాధ్యాయుడు కె.రాములు, హైస్కూల్ ఉపాధ్యాయులు సదానందం, కర్ణాకర్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో జోరుగా చేపల విక్రయాలు





ఖిలా వరంగల్: ఫోర్ట్‌రోడ్డుపై చేపలు కొనుగోలు చేస్తున్న జనం



కాజీపేటలో చేపలు విక్రయిస్తున్న వ్యాపారులు





- రహదారులపై మీనం సందడి
- భారీగా పెరిగిన ధరలు

ఖిలా వరంగల్: మృగశిర కార్తెను పురస్కరించుకుని చేపల అమ్మకాలు నగరంలో శనివారం జోరుగా సాగాయి. మృగశిర కార్తె రోజున చేపల కూర తినాలనే పెద్దల నానుడి ప్రచారంలో ఉంది. దీంతో వందలాది మంది చేపల కొనుగోలు కోసం ఎగబడ్డారు. వరంగల్ ఫోర్ట్‌రోడ్డుపై శనివారం చేపల సందడి కనిపించింది. జనంతో చేపల మార్కెట్లన్నీ కిటకిటలాడాయి. మృగశిర కార్తె తొలిరోజు చేపలు తింటే ఆరోగ్యంగా ఉండవచ్చని, వ్యాధులు దరిచేరవని ప్రజల నమ్మకం. చేపల మార్కెట్లు కొనుగోలుదారులతో కిక్కిరిసి పోగా వ్యాపారులు ఎక్కువ ధరలకు విక్రయిస్తూ కనిపించారు. వివిధ గ్రామాల నుంచి క్వింటాళ్ల కొద్దీ చేపలను నగరానికి తీసుకొచ్చారు. దాంతో కొనుగోలుదారులతో రహదారులన్నీ సందడిగా మారాయి. చేపల ధరలు గతేడాది కన్నా ఎక్కువున్నా అదే స్థాయిలో అమ్మకాలు జరిగాయి. సాధారణంగా రవ్వ, బొచ్చ చేపలు కిలోకు రూ.150లకు అమ్ముతుండగా మృగశిర కార్తె సందర్భంగా వాటి ధర రూ.180ల ధర పలికింది. రూ.300లు నుంచి రూ.350 ధర గల కొర్రమీనులను రూ.450లకు విక్రయించారు. మృగశిర సందర్భంగా మంచి లాభాలు వచ్చాయని మత్స్యకార్మికులు ఆనందం వ్యక్తం చేశారు.

కాజీపేటలో..

కాజీపేట: కాజీపేట పట్టణంలోని మార్కెట్‌లో వ్యాపారులు ప్రత్యేకంగా టెంట్లు వేయించి మరీ అమ్మకాలు జరిపారు. సాధారణ రోజుల్లో కిలో చేపను రూ.100 – 120 వరకు అమ్మిన వ్యాపారులు మృగశిర కార్తె అంటూ రూ.150కి కిలో చొప్పున విక్రయించి లాభాలు దండుకున్నారు. కొర్రమీను చేపలను రూ.450 విక్రయించారు. కాజీపేట – సోమిడి రోడ్డు, బాపూజీనగర్ చేపల మార్కెట్, మదర్‌థెరిస్సా విగ్రహం, రహమత్‌నగర్, విష్ణుపురి, సోమిడిలో చేపల విక్రయాలు బాగా సాగాయి.

'నీట్' మళ్లీ నిర్వహించాలని ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, విద్యార్థులు

విద్యారణ్యపురి: ఇటీవల విడుదలైన నీట్‌పరీక్ష ఫలితాల్లో 67మందికి 720 మార్కులకు 720మార్కులతో ఆల్‌ఇండియా మొదటి ర్యాంకు రావడం, అందులో ఆరుగురు అభ్యర్థులు ఒకే పరీక్ష కేంద్రం నుంచే ఉండడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అన్నారు. ఈక్రమంలో నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై న్యాయ విచారణ జరిపించి మళ్లీ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేస్తూ హనుమకొండలో శనివారం ఆందోళన చేశారు. సర్క్యూట్ గెస్ట్ హౌస్ నుంచి పోలీస్ హెడ్‌క్వార్టర్ వరకు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ సెంటర్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్ మాట్లాడుతూ నీట్ పరీక్షపై సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలని సూచించారు. మెడిసిన్‌లో ప్రవేశాలకు దేశవ్యాప్తంగా నిర్వహించి నీట్‌ను మళ్లీ నిర్వహించాలని కోరారు. అవకతవకలకు పాల్పడినట్లు తేలితే బాధ్యులపై చర్య తీసుకోవాలన్నారు.

శ్రమకు తగిన వేతనాలివ్వాలి

వరంగల్ చౌరస్తా: రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో టీజీ ట్రాన్స్‌కోలో పనిచేస్తున్న గ్యాంగ్‌కవర్‌లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యలపై పాలకులు స్పందించాలని ఆర్టిజన్ గ్రేడ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వడ్డేపల్లిలోని –327 యూనియన్ కార్యాలయంలో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతోకాలంగా సీబీడీ గ్యాంగ్‌ల్లో పనిచేస్తూ ఆర్టిజన్లుగా సంస్థలో విలీనం చేసిన తర్వాత వారికి ఆర్టిజన్ గ్రేడ్ –1 జీతం ఇస్తూ వచ్చారని అన్నారు. ఆ తర్వాత విద్యార్హతతో వారి గ్రేడ్‌ను మార్చడం వలన వారి జీతం తగ్గిపోయిందని యూనియన్ నాయకుడు శ్రీధర్ తెలిపారు. సమావేశంలో గ్యాంగ్ ప్రతినిధి కల్యాణ్, మురళి, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

తల్లీకూతుళ్ల అదృశ్యం



మాధవి



సహస్ర

హసన్‌పర్తి: తల్లీకూతుళ్లు అదృశ్యమయ్యారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో బాధితులు శనివారం ఫిర్యాదు చేశారు. గోపాలపురం మారుతి కాలనీకి చెందిన శ్రీశైలం ప్రైవేట్ ఉద్యోగి. అతని భార్య మాధవి, ఏడేళ్ల కూతురు సహస్ర ఈనెల 6వ తేదీన అదృశ్యమయ్యారు. బంధువులు, కుటుంబ సభ్యుల ఇళ్లల్లో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులను శ్రీశైలం ఆశ్రయించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ సంజీవ తెలిపారు.

కమ్యూనిస్టు నేత భగవాన్‌దాస్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కడియం, తదితరులు

హన్మకొండ చౌరస్తా: కమ్యూనిస్టు నాయకుడు బీఆర్ భగవాన్‌దాస్ 94వ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల జంక్షన్‌లోని భగవాన్‌దాస్ విగ్రహానికి ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్.నాగరాజు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాసరావు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ భగవాన్‌దాస్ పోరాటాల ఫలితంగానే వరంగల్ నగరానికి తాగునీరు వచ్చిందని గుర్తుచేశారు. ఆయన స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లో నిలదొక్కుకున్నానని అన్నారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ తాను చిన్నతనం నుంచి భగవాన్‌దాస్ పోరాట పటిమకు ఆకర్షితుడినై, ఆయన స్ఫూర్తితో ముందుకు సాగానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జ్యోతి, భిక్షపతి, కరుణాకర్, రమేష్, శ్రీనివాస్, భగవాన్‌దాస్ తనయులు డాక్టర్ రాజ్‌సిద్ధార్థ, అంబేడ్కర్, లెనిన్, మాజీ కార్పొరేటర్లు, జర్నలిస్టు సంఘాల నాయకులు పాల్గొన్నారు.


ఉచిత శిక్షణతో ఉత్తమ ఫలితాలు



అధ్యాపకులను సన్మానిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: ప్రతిభగల అధ్యాపకుల పర్యవేక్షణలో విద్యార్థులకు శిక్షణ ఇస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి అన్నారు. గతంలో కాకతీయ యూనివర్సిటీలో వివిధ పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ ఇచ్చిన అధ్యాపకులకు శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేయూలో శిక్షణ తీసుకున్న పలువురు విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపి ఉద్యోగాలు సాధించారని ప్రశంసించారు. కోచింగ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ నాగయ్య మాట్లాడుతూ కేయూలో ఇచ్చిన ఉచిత కోచింగ్‌లో 69మంది కానిస్టేబుళ్లు, ముగ్గురు ఎస్సైలు, ఒకరు గ్రేడ్ –1 ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్, జేఎల్ఎం ఉద్యోగానికి ఎంపికయ్యారని వివరించారు. అలాగే, గురుకులాల్లో పలువురు ఉపాధ్యాయ కొలువులు సాధించారని చెప్పారు. అనంతరం ఉచితంగా శిక్షణ ఇచ్చిన అధ్యాపకులు మధు, ప్రశాంత్‌రెడ్డి, డాక్టర్ వీరస్వామి, డాక్టర్ శంకర్, వీణను రిజిస్ట్రార్‌తో పాటు పలువురు సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ చందులాల్, డాక్టర్ రమేష్, రాజ్‌కుమార్, రాజేష్, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

మోదీని వ్యతిరేకించిన దేశ ప్రజలు



మాట్లాడుతున్న గుంగుల దయాకర్

ఖిలా వరంగల్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని, కార్పొరేట్ విధానాలను దేశ ప్రజలు వ్యతిరేకించారని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నేత గుంగుల దయాకర్ అన్నారు. వరంగల్ ఫోర్ట్ రోడ్డు విద్యానగర్ కాలనీలో న్యూడెమోక్రసీ నాయకుడు రాచర్ల బాలరాజు అధ్యక్షతన శనివారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో దయాకర్ మాట్లాడారు. మోదీ ప్రభుత్వం ఈడీ, ఐటీ, సీబీఐ తదితర సంస్థలను అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష పార్టీల నాయకులను భయభ్రాంతులను గురిచేయడం, ప్రభుత్వాలను పడగొట్టడం, చీల్చడం చేస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. రైతు వ్యతిరేక మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని పోరాడుతున్న రైతాంగంపై ఉక్కుపాదం మోపడం బాధాకరమని వాపోయారు. కార్యక్రమంలో బండి కోటేశ్వర్‌రావు, ఎలకంటి రాజేందర్, గట్టు కృష్ణ, రంజిత్ కుమార్, ఇనుముల కృష్ణ, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బాబు

కాశిబుగ్గ: నగరంలోని 18వ డివిజన్ ఎస్‌ఆర్‌టీ కాలనీలో మంత్రి కొండా సురేఖ మంజూరు చేసిన రూ.35లక్షల ఖర్చుతో చేపట్టిన పనులతో తాగునీటి సమస్య పరిష్కారం అయిందని స్థానిక కార్పొరేటర్ వస్కుల బాబు తెలిపారు. డివిజన్‌లోని ట్యాంకు వద్ద మోటార్లను శనివారం ప్రారంభించి ఆయన మాట్లాడారు. 2005లో వైఎస్‌ఆర్ హయాంలో ఎస్‌ఆర్‌టీ కాలనీలో 14లక్షల లీటర్ల నిల్వ సామర్థ్యం గల ట్యాంక్‌ను నిర్మించినట్లు తెలిపారు. అనంతరం ఆ ట్యాంక్ మోటార్లు మరమ్మతులకు గురికావడాన్ని మంత్రి సురేఖ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించినట్లు ఆయన వివరించారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా..

- కలెక్టరేట్‌లో హబ్ ఏర్పాటు
- మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు అవగాహన సదస్సులు



హనుమకొండ కలెక్టరేట్‌లో బేటీ బచావో బేటీ పఢావో వేడుకలు (ఫైల్)

కాజీపేట అర్బన్: మహిళా సాధికారతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సారథ్యంలో మహిళా సాధికారత హబ్‌ను ఏర్పాటు చేసింది. మహిళా సాధికారతకు ప్రభుత్వం అందజేస్తున్న అవకాశాల్ని అందిపుచ్చుకునేందుకు మార్గాన్ని చూపించడంతో పాటు మహిళలను చైతన్య పర్చేందుకు ఈ హబ్ తోడ్పడుతుంది. మిషన్ శక్తిలో భాగంగా ఏడాది క్రితం హనుమకొండ కలెక్టరేట్‌లోని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో హబ్‌ను ఏర్పాటు చేశారు.

అవగాహన కార్యక్రమాలు

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసేందుకు, స్వయం ఉపాధి సాధించేందుకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల వృత్తి నైపుణ్య శిక్షణలపై గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో అవగాహన అందిస్తుంది మహిళా సాధికారత హబ్. మహిళల కోసం ఉన్న చట్టాలు, వరకట్న, గృహ హింస, లైంగిక హింస, భ్రూణహత్యల నివారణకు ఆపదలో ఆదుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంస్థలపై మార్గనిర్దేశనం చేస్తున్నారు. ఆరోగ్యం, భద్రత, డిజిటల్ అక్షరాసత్యపై అవగాహన కల్పిస్తున్నారు.

ఆరుగురు బృందంగా..

మహిళా సాధికారత హబ్‌లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు చెందిన ఉద్యోగులు ఆరుగురిని టీంగా ఏర్పాటు చేసి జిల్లా మిషన్ కో–ఆర్డినేటర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ప్రారంభించిన ఏడాదిలో 135కు పైగా అవగాహన సదస్సులు నిర్వహించి బాలికలు, మహిళలను చైతన్యపరుస్తున్నారు.

ఆడపిల్లలను రక్షిద్దామంటూ..

సమాజంలో ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించేలా, ఆడపిల్లలను రక్షిద్దాం, ఆడ పిల్లలను చదివిద్దాం అంటూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2015 జనవరి 22న బేటీ బచావో బేటీ పఢావోపై విస్తృత స్థాయిలో అవగాహన నిర్వహిస్తున్నారు. భ్రూణహత్యల నివారణకు, ఆడపిల్ల వద్దు అనుకునే వారి కోసం ఏర్పాటు చేసిన శిశు గృహ, ఊయల వంటి కార్యక్రమాలతో ఆడపిల్లలను రక్షిస్తున్నారు.

నేడు వైబ్రంట్ స్కాలర్‌షిప్ టెస్ట్

హన్మకొండ: వైబ్రంట్ స్కాలర్‌షిప్ టెస్ట్‌ను ఈనెల 9న నిర్వహించనున్నట్లు వైబ్రంట్ అకాడమీ డైరెక్టర్ సీహెచ్.రాజేందర్ రెడ్డి, అకడమిక్ హెడ్ పులి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. స్కాలర్‌షిప్ టెస్ట్ పోస్టర్లను హనుమకొండ నక్కలగుట్టలోని కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ప్రతిష్టాత్మకమైన ఐఐటీ, నీట్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ వైబ్రంట్ అకాడమీ ఆధ్వర్యంలో నీట్ లాంగ్‌టర్మ్ కోచింగ్ కోసం ఆదివారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ పరీక్షకు హాజరైన విద్యార్థులకు ఫీజులో రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైబ్రంట్ అకాడమీ సిబ్బంది గుండాల రాజు, రాం గుమ్మడి, నారాయణ సింగ్, డి.రాజు, విజయ్‌కుమార్, శ్రీనాథ్, అరుణ్, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.